సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం : 25 : సెప్టెంబర్ : 2023

లంబోదరునికి మహానైవేద్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయ కునిని ఆదివారం 108 రకాల మహానైవేద్యాన్ని సమర్పించారు. హరీశ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిం చిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూర భిక్షపతి, బండారి సత్తయ్య, ఉప్పల చంద్రం, నార్ల సతీశ్, శ్రీనివాస్, అంజయ్య, శేఖర్, మహి ళా సంఘం అధ్యక్షురాలు మాచెట్టి పద్మజ తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు



క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: వేములవాడ మండలం నూకలమర్రి ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికలకు నెట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. సర్పంచ్ పెండ్యాల తిరుపతి, ఎంపీటీసీ శంకరవ్వ, ఏఎంసీ డైరెక్టర్ పెండ్యాల శంకర్, విద్యాకమిటీ చైర్మన్ దేవరాజు, చైతన్య యూత్ క్లబ్ అధ్యక్షుడు రోమాల జగదీశ్, నిర్వాహకులు లక్ష్మీనారాయణ, పీఈటీలు అజయ్, సునంద, లత, మహేశ్ పాల్గొన్నారు.

ఒకటిన మిలాద్ ఉన్ నబీ



మాట్లాడుతున్న సలీమ్

సిరిసిల్లటౌన్: మిలాద్ ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను అక్టోబర్ 1న నిర్వహించనున్నట్లు మజీద్ కమిటీ అధ్యక్షుడు సలీం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సలీం మాట్లాడారు. వినాయక నిమజ్జనం, మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఒకే రోజు రావడంతో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసుల సూచనల మేరకు వేడుకలను 1న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.

25 నుంచి ఆశవర్కర్ల సమ్మె జయప్రదం చేయండి

సిరిసిల్లటౌన్: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఆశవర్కర్లు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గ్రూప్-1 రద్దు



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లఎడ్యుకేషన్: పోటీపరీక్షల నిర్వహణలో జరిగిన తప్పిదాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని శివనగర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల ఎంపికకు నిర్వహించే పరీక్షల్లో టీఎస్పీఎస్సీ విఫలమైందన్నారు. నిరుద్యోగులు ఎన్నో ఆశలతో వేలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకొని పరీక్షలు రాసి మొదటిసారి అంగట్లో సరుకుల మాదిరి ప్రశ్నాపత్రాలు అమ్మకాలు జరిగినట్లు తెలిందన్నారు. పరీక్ష రద్దుకు ప్రభుత్వం బాధ్యత వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, కార్యదర్శి సూర భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిర్వాసితుల సమస్యలు పరిష్కారం



కండువా కప్పుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వేములవాడలోని తన నివాసంలో రుద్రవరం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి నెరవేర్చలేదని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణానికి రూ.5.04 లక్షలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, ఊరడి రాజశేఖర్, కూస శ్రీనివాస్, పార్వతీ ప్రసాద్, మహేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసింది.. లక్ష్యం మిగిలింది

- కొనసాగుతున్న బతుకమ్మ చీరల ఉత్పత్తి
- ఇప్పటికే 5.12 కోట్ల మీటర్ల బట్ట సేకరణ
- సేకరించాల్సిన బట్ట 44 లక్షల మీటర్లు
- నెలాఖరు వరకు గడువు
- ఏటా ఇదే తీరు..
- చివరి దశలో హడావుడి



తంగళ్లపల్లి ప్రాసెసింగ్ యూనిట్‌లో బతుకమ్మ చీరల ప్యాకింగ్

సిరిసిల్ల: బతుకమ్మ చీరల తయారీ చివరి దశకు వచ్చింది. కాలంతో పోటీపడుతూ ఆరు నెలలుగా సిరిసిల్లతోపాటు పరిసర గ్రామాల్లోని మరమగ్గాలపై చీరల వస్త్రాన్ని నేతన్నలు నేస్తున్నారు. బతుకమ్మ పండుగ సమీపిస్తుండగా.. చీరలబట్ట ఉత్పత్తి.. సేకరణ.. ప్రాసెసింగ్ కొనసాగుతుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇక్కడ ఉత్పత్తి అయిన బతుకమ్మ చీరలను తరలిస్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతీ పేదింటికి చీరలు చేరుతున్నాయి. సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తిపై కథనం..

బతుకమ్మ చీరల ఉత్పత్తి స్వరూపం

చీరల ఆర్డర్లు	: 5.56 కోట్ల మీటర్లు
సేకరించిన చీరల బట్ట	: 5.12 కోట్ల మీటర్లు
సేకరించాల్సిన చీరల బట్ట	: 44 లక్షల మీటర్లు
చివరి గడువు	: సెప్టెంబరు 30
చీరల ఆర్డర్ల విలువ	: రూ.330 కోట్లు
ఉత్పత్తి చేస్తున్న చిన్నతరహా పరిశ్రమలు	:127
భాగస్వాములైన మ్యాక్స్ సంఘాలు	: 139
ఒక్కో మీటరుకు ప్రభుత్వం చెల్లిస్తుంది	: రూ. 35.50
ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న సాంచాలు	: 9,480
శ్రమించే నేతకార్మికులు	: 5 వేలు
నిత్యం ఉత్పత్తి అవుతున్న చీరల బట్ట	: 4.10 లక్షల మీటర్లు



సిరిసిల్ల శివారులోని తంగళ్లపల్లి ప్రాసెసింగ్ యూనిట్‌లో బతుకమ్మ చీరల ప్రాసెసింగ్

ఆరునెలల కిందటే ఆర్డర్లు

గత ఏప్రిల్‌లో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చారు. నూలు కొనుగోలు చేసి, బీములు పోసి, సాంచాలపైకి ఎక్కేసరికి జూన్ వచ్చింది. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి బతుకమ్మ చీరల బట్ట ఉత్పత్తి, సేకరణ పూర్తి చేయాలని జౌళిశాఖ అధికారులు గడువు విధించారు. గడువులోగా 4.95 కోట్ల మీటర్ల బట్ట మాత్రమే పూర్తయింది. ఇంకా 61 లక్షల మీటర్ల బట్టను సేకరించాల్సి ఉండగా.. మగ్గాలపై ఉన్న బీములు తెగేందుకు (పూర్తయ్యేందుకు) మరో పది రోజుల గడువు కావాల్సి ఉంది. వస్త్రోత్పత్తిదారుల విన్నపంతో జౌళిశాఖ క్షేత్రస్థాయి నివేదిక ఆధారంగా సెప్టెంబరు 15వ తేదీ వరకు గడువు విధించింది. బట్ట నాణ్యత పరిశీలన, సేకరణకు మరో ఐదు రోజుల గడువు ఇచ్చారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా బట్టసేకరణను జౌళిశాఖ యంత్రాంగం సిద్ధమైంది. గడువు దాటినా లక్ష్యం మిగిలి ఉండడంతో చీరల బట్ట ఉత్పత్తి ఇంకా కొనసాగుతోంది.

నిరుటి బట్టతో లక్ష్యం దిశగా..

సిరిసిల్లలో గతేడాది ఉత్పత్తి అయిన బతుకమ్మ చీరల బట్టను ఈ ఏడాది కొనుగోలు చేశారు. గతేడాది బీములపై మిగిలిన బట్టను ఈ ఏడాది కొనుగోలు చేసేందుకు జౌళిశాఖ అనుమతి ఇచ్చింది. సిరిసిల్లలోని పలువురు వస్త్రోత్పత్తిదారులు 62.62 లక్షల మీటర్ల బట్టను ఇవ్వడంతో ఈ ఏడాది లక్ష్యం నెరవేరింది. మరోవైపు వరంగల్ జిల్లాలోనూ బతుకమ్మ చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా.. అక్కడ ఉత్పత్తి జరుగలేదు. దీంతో చివరి దశలో పదిహేను రోజుల కిందట సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌కు వరంగల్ ఆర్డర్లను మళ్లించారు. దీంతో అక్కడ చీరలకు అవసరమైన జాకెట్ బట్టను ఉత్పత్తి చేస్తున్నారు. బతుకమ్మ చీరల ఉత్పత్తి గడువు ముగిసినా.. లక్ష్యం మిగిలి ఉన్నా.. మొత్తంగా బతుకమ్మ పండగకు ముందు చీరలను సరఫరా చేసేందుకు జౌళిశాఖ సన్నద్ధమైంది.

ప్రాసెసింగ్... ప్యాకింగ్

సిరిసిల్లలోని ప్రాసెసింగ్ యూనిట్‌లో బతుకమ్మ చీరలు బట్టను ప్రాసెస్ చేసి, ప్యాకింగ్ చేస్తున్నారు. బట్టను హైదరాబాద్‌లోని కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లకు అందించగా.. కొంతమేరకు ఇక్కడి ప్రాసెసింగ్ యూనిట్‌కు అందించారు. దీంతో ఇక్కడే ఉత్పత్తి అవుతూ.. ఇక్కడే ప్రాసెసింగ్ చేస్తూ.. ప్యాకింగ్ చేస్తూ.. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు బతుకమ్మ చీరలు ఎగుమతి అవుతున్నాయి.

గడువులోగా సేకరణ పూర్తి



బతుకమ్మ చీరల ఉత్పత్తి సిరిసిల్లలో చివరి దశకు చేరింది. సెప్టెంబరు నెలాఖరులోగా సేకరణ పూర్తి చేస్తాం. మళ్లీ గడువు పొడగించే అవకాశం లేదు. ఆర్డర్ల మేరకు బతుకమ్మ చీరల బట్టను సేకరిస్తున్నాం. గతేడాది చీరల బట్టను కూడా ఉన్నతాధికారుల అనుమతితో తీసుకున్నాం. ఈ ఏడాది బతుకమ్మ చీరల ఉత్పత్తి తుది దశకు చేరింది.

– మిట్టకోల సాగర్, జౌళిశాఖ ఏడీ

వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించాలి

- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- సిరిసిల్లలో వృద్ధులకు ఉపకరణాల పంపిణీ

సిరిసిల్ల: వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ హైస్కూల్‌లో వయోవృద్ధులకు ఆదివారం రూ.25 లక్షల విలువైన ఉపకరణాలు పంపిణీ చేశారు. గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వృద్ధులకు ఆసరా పెన్షన్లు ఇస్తూ అండగా ఉంటుందన్నారు. వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించే విధంగా చట్టాలను చేసి కొడుకులు పోషించకుంటే ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని ఆర్డీవోలకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వృద్ధులకు ఉపయోగపడేలా చేతికర్రలు, వీల్‌చైర్లు, వినికిడి మిషన్లు, నడుం, మెడపట్టీలు తదితర రూ.25 లక్షల విలువైన పరికరాలను అందించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఆలింకో ద్వారా రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకంలో ఉపకరణాలు అందించారు. అదనపు కలెక్టర్ బి.గౌతమ్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ అధికారి సంజయ్ కోహ్లీ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, ఎల్లారెడ్డిపేట ఎంపీపీ పిల్లి రేణుక, సీడీపీవోలు సుచరిత, ఎల్లయ్య, సఖీ కో–ఆర్డినేటర్ పద్మ, పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ బాలకృష్ణ, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు డాక్టర్ జనపాల శంకరయ్య, స్థానిక కౌన్సిలర్ యెల్లండి దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉపకరణాలు పొందిన వయోవృద్ధులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు





రవీందర్‌రావుకు ప్రసాదాలు అందిస్తున్న అధికారులు, కోడెలు అందిస్తున్న అధికారులు

రాజన్నా పాహిమాం

వేములవాడ/వేములవాడఅర్బన్:రాజన్నను ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు సిరిగిరి రాములు, తిరుపతిరావు ఉన్నారు. గోశాలకు రాజన్న కోడెలు తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను వరంగల్, జనగాం, మహబూబాబాద్ జిల్లాలోని గోశాలలకు అందజేశారు. జనగామ జిల్లా దేవరుప్పల మండలం పద్మావతితండాలోని పరమేశ్వర గోశాలకు 20, వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జింగురంతండాకు చెందిన బాలాజీ గోశాలకు 20, మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన ఆర్‌సీ తండాలోని శివశంకర గోశాలకు 20 కోడెలను అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

- జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య
- సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన



మాట్లాడుతున్న ఆకునూరి శంకరయ్య

సిరిసిల్ల: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు సాధించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన నిర్వహించారు. శంకరయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాలపై వివక్షను రూపుమాపాలని అంబేడ్కర్ ఆశించారని, అన్ని వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగాన్ని రాశారన్నారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఎస్పీ నాయకులు ఎనగందుల వెంకన్న పాల్గొన్నారు.

మాండలిక మార్గదర్శకుడు 'గూడూరి'

- తెలంగాణ తొలితరం కథకుడు
- పుష్కరకాలంలో 85 కథలు
- నేడు గూడూరి సీతారాం వర్ధంతి



సిరిసిల్లకల్చరల్: తెలంగాణభాషకు, యాసకు పట్టం కట్టిన తొలితరం కథకుడు.. గూడూరి సీతారాం. మాండలికానికి పట్టం కడుతూ పుష్కరకాలంలో 85 కథలు రాశారు. సినారె సాహచర్యం.. మానేరు నీటి ప్రభావంతో సీతారాం కథల ప్రవాహం కొనసాగింది. 1950 దశకంలోనే కథకుడిగా రాణించిన గూడూరి సీతారాం స్వస్థలం వేములవాడ సమీపంలోని హనుమాజిపేట.

1936, జులై 18న హనుమాజీపేటలో గూడూరి సీతారాం జన్మించారు. సినారె పక్కింట్లోనే నివసించారు. సినారె సాహచర్య ప్రభావం సీతారంపై ఉంది. ఏడో తరగతిలోనే నినాదం, స్త్రీ స్వాతంత్ర్యం అనే కథలు రాశారు. తన స్వగ్రామంలోని ప్రజల సాధారణ జీవితాల్లోని సంఘటనలనే కథావస్తువులుగా ఎంచుకుని అనేక రచనలు చేశారు. మారాజు, నారిగాని బతుకు, రంగడు, రాజమ్మ రాజరికం, లచ్చి, పెళ్లిప్రేమ, అలిగొచ్చిన ఎర్రిబాగులోడు, జరంపడి, పోలీసుల చేతిలో తన్నులు తిని, మేడిపండు, మీకు ఖర్చు పెట్టడం వస్తుందా, అందని ఆకాశం, అబ్బాయి, అమ్మాయి, దెబ్బతిన్న అహంభావం, ఎర్రనిపువ్వు, బస్సొచ్చింది, పిచ్చోడు.. వంటి కథలు రాశారు. అయితే ఆయన కథలు అలభ్యంగా ఉన్నాయి. మానేరు రచయితల సంఘం కృషితో 14 కథలను సంపాదించగలిగారు. తెలంగాణ పల్లెల్లోని ప్రజలు మాట్లాడుకునే మాండలికానికి సాహిత్యస్థాయి కల్పించి మలితరం కథకులకు మార్గదర్శకుడిగా నిలిచారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన అభిమానులు, సాహిత్యకారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కంచె మాయం

- అడవికి రక్షణ కరువు
- రూ.5 లక్షల విలువ చేసే ఫెన్సింగ్ చోరీ
- ఫిర్యాదు చేసిన అటవీశాఖ అధికారులు
- స్థానికుల్లో పలు అనుమానాలు

చందుర్తి(వేములవాడ): ఫారెస్ట్‌లో దొంగలు పడ్డారు. అటవీ సంపద రక్షణకు ఏర్పాటు చేసిన కంచె(ఫెన్సింగ్) మాయమైంది. లక్షల విలువ చేసే కంచె మాయమవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. దాదాపు 600 మీటర్ల పొడవు ఉన్న 60 చుట్టలకు పైగా చోరీకి గురైంది. దాదాపు 90 కిలోల బరువు ఉండే ఒక్కో చుట్టను ఎత్తుకెళ్లాలంటే కనీసం నలుగురి అవసరం ఉంటుంది. ఇంత మంది అంత భారీ మొత్తంలో కంచె తీగను ఫారెస్ట్ నుంచి ఎత్తుకెళ్లడం సులువేమీ కాదంటున్నారు పలువురు అధికారులు. ఈ ఘటనపై చందుర్తి పోలీసులకు ఫారెస్ట్ అధికారులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీరియస్‌గా విచారణ చేపట్టారు.

ఎత్తుకెళ్లింది ఎప్పుడో ?

మండలంలోని తిమ్మాపూర్, నర్సింగాపూర్ గ్రామాల సరిహద్దును ఆనుకుని ఉన్న అటవీప్రాంతంలో భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 600 మీటర్ల పొడవు గల కంచె తీగను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. 10 మీటర్ల పొడవు గల ఇనుప చువ్వల బరువు కనీసం 90 కిలోల వరకు ఉంటుందని.. 60 చుట్టలను విప్పి ఎత్తుకెళ్లేందుకు కనీసం ఐదారు రోజులైనా పడుతుంది. ఇనుపరాడ్స్‌కు బిగించిన కంచెను విప్పేందుకు కనీసం నలుగురైదుగురు అవసరం ఉంటుంది. అంత పెద్ద ఫారెస్ట్ నుంచి ఎడ్లబండ్ల ద్వారా తరలించడమే కష్టతరం.



అటవీప్రాంతంలో కంచె దొంగతనానికి గురైన ప్రాంతం ఇదే..

కనిపించని ఆనవాళ్లు

కంచెను విప్పే సమయంలో అక్కడ మనుషులు తిరిగి ఉంటే అడుగుల ఆనవాళ్లు పడాలి. కానీ అక్కడ మనుషులు సంచరించినట్లు ఆనవాళ్లే లేవు. విప్పిన కంచెను ఎత్తుకెళ్లేందుకు వచ్చిన వాహనాలు టైర్ల గుర్తులు కూడా పడలేవు. ఆగస్టు 25న కంచె ఎత్తుకెళ్లారని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు మరుసటి రోజు అటవీ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. కంచె పోయిన ఏరియాలో మనుషులు తిరిగిన ఆనవాళ్లు కనిపించకపోవడంతో దొంగతనం ఎప్పుడు జరిగిందనే అనుమానాలు పోలీసుల్లో కలుగుతున్నాయి. ఈ విషయమై మరోమారు అటవీశాఖ సిబ్బందితో పోలీసులు చర్చించినట్లు తెలిసింది.



కంచె పోయిన ప్రాంతం నుంచి ఎడ్లబండ్లు వెళ్లిన ఆనవాళ్లు

కరువైన నిఘా

కంచె మాయమైన ప్రాంతం నుంచి టేకు కలప తరలిపోతున్నట్లు అక్కడ కనిపించిన ఎడ్లబండ్ల చక్రాల(గీరెల) అచ్చులే నిదర్శనం. ఫెన్సింగ్ పోయిన ప్రాంతం నుంచే అటవీలోకి వెళ్లి ఎడ్లబండ్ల ద్వారా కలపను తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని కూడా అటవీశాఖ అధికారులు గుర్తించలేదని తెలుస్తోంది. కనీసం అక్రమ రవాణాదారులపై దృష్టి సారిస్తే రూ.5లక్షల విలువైన ఫెన్సింగ్‌ను ఎత్తుకెళ్లిన వారు దొరుకుతారని స్థానికులు భావిస్తున్నారు. స్మగ్లర్లతో అటవీశాఖలోని కిందిస్థాయి సిబ్బంది కుమ్మక్కవడంతో విలువైన అటవీ సంపద తరలిపోతుందనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమానాలెన్నో..

కంచె బిగించడం తెలిసిన వారే దొంగతనానికి పాల్పడి ఉంటారని అటవీశాఖ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ శాఖలోనే కొందరు కంచెను అమ్ముకుని ఉంటారనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

అటవీ ప్రాంతంపై దృష్టి పెట్టాం

ఫెన్సింగ్ పోయిన అటవీ ప్రాంతంపై దృష్టి పెట్టాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. ఫెన్సింగ్ దొంగతనానికి గురైందన్న విషయంపై చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాం. మా శాఖలో సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నాం. ఫెన్సింగ్‌ను ఎత్తుకెళ్లడం సామన్య రైతులతో కాదు. దాని గురించి తెలిసిన వారే దొంగతనం చేసే అవకాశం ఉంటుంది. పోలీసుల విచారణ కొనసాగుతుంది.

– ఖలీలొద్దీన్, ఎఫ్ఆర్వో, వేములవాడ

క్లుప్తంగా

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు


కోతుల దాడిలో గాయపడ్డ లక్ష్మి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాలకు చెందిన ఎరవెల్లి లక్ష్మి(65)పై ఆదివారం కోతులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన లక్ష్మి తన ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా కోతుల మంద వచ్చింది. వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా దాడికి పాల్పడ్డాయి. కోతుల దాడిలో గాయపడ్డ లక్ష్మిని ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.

ఎంపీకి మండల పర్యటనకు ఆహ్వానం


బండిని కలిసిన మండల నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ను మండల బీజేపీ నాయకులు ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. మండల పర్యటనకు రావాలని ఆహ్వానించారు. అక్టోబర్ మొదటి వారంలో పర్యటన ఉంటుందని తెలిపినట్లు మండల నాయకులు చెప్పారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంతుర్తి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నమిలికొండ శ్రీకాంత్, బీజేవైఎం సీనియర్ నాయకులు మానక కుమార్, సూర రాజు, లద్దునూరి రాజు, జెల్ల బాలకిషన్ ఉన్నారు.

మిడ్‌మానేరుకు ఎస్సారెస్పీ నీరు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఆదివారం రాత్రి నీటి విడుదల చేశారు. ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ మీదుగా 8 వేల క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో మిడ్‌మానేరుకు వస్తోందని అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి ఒక్క గేటు ద్వారా 300 క్యూసెక్కుల నీటి విడుదల అవుతోంది. మిడ్‌మానేరులో 23.13 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నందికమాన్ వద్ద ఆదివారం బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియలేదు.

ఆటోను ఢీకొన్న లారీ

మల్యాల(చొప్పదండి): ముత్యంపేట శివారులో జగిత్యాల–కరీంనగర్ రహదారిపై ఓ ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. బల్వంతాపూర్‌కు చెందిన కుటుంబసభ్యులు ఏడుగురు ఆదివారం ఆటోలో జగిత్యాల వెళ్తుండగా లారీ వెనక నుంచి ఢీకొంది. ప్రమాదంలో జహంగీర్, హుస్సేన్‌బీ తలకు తీవ్ర, మిగతా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను 108 వాహనంలో జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదే సంఘటనలో దుబాయ్ వెళ్లేందుకు జగిత్యాల బస్టాండ్‌కు వెళ్తున్న వ్యక్తికి గాయాలు కాలేదు. ఆటోడ్రైవర్ ఫిర్యాదుతో లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఎల్లలు దాటొస్తున్న గంజాయి

- 'ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడు తన వాహనంపై భద్రాచలం అటవీ ప్రాంతానికి వెళ్లి, గంజాయి తరలిస్తుండగా మార్గమధ్యలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఇలా చాలా మంది కరీంనగర్ యువకులు గంజాయి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నట్లు సమాచారం.'
- 'నాలుగు రోజుల క్రితం కరీంనగర్ మండలానికి చెందిన 10 మంది యువకులు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా చేస్తూ ఒడిశా పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది.'

- ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుగా కరీంనగర్‌కు దిగుమతి
- ఒడిశా పోలీసులకు చిక్కిన 10 మంది యువకులు?


ఇటీవల పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

కరీంనగర్ క్రైం: వివిధ రాష్ట్రాల నుంచి కరీంనగర్‌కు గంజాయి దిగుమతి అవుతోంది. ఎల్లలు దాటి గంజాయి రవాణా చేస్తూ కరీంనగర్‌కు చెందిన పలువురు యువకులు ఇతర రాష్ట్రాల పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొదట ఫ్యాషన్‌గా ప్రారంభించి, తర్వాత బానిసలుగా మారి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి సేవించడంతోపాటు జల్సాల ఖర్చుల కోసం దాన్ని వ్యాపారంగా మార్చుకొని, చాలా మంది యువకులకు అలవాటు చేస్తున్నారు. ఎక్కువ శాతం కళాశాల విద్యార్థులు, పలుచోట్ల మైనర్లు, కార్మికులకు విక్రయించి, డబ్బులు దండుకుంటున్నారు.

మన రాష్ట్రంలో దొరక్కపోవడంతో..

మన రాష్ట్రంలో గంజాయి దొరక్కపోవడంతో ఎక్కువ శాతం మంది పక్క రాష్ట్రాల మీద దృష్టి పెడుతున్నారు. పలు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు దిగుమతి అవుతోంది. అయితే అక్కడ కొనుగోలు చేస్తే రేటు ఎక్కువగా ఉంటుందని నేరుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్నాటకలోని బీదర్, ఆంధ్రప్రదేశ్‌లోని అరకు సమీప ప్రాంతాలు, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలు, సీలేరుకు వెళ్లి, కరీంనగర్‌కు తీసుకువస్తున్నారు. గతంలో పలువురు పోలీసులకు చిక్కడమే ఇందుకు ఉదాహరణ.

యువతే టార్గెట్..

గంజాయి వ్యాపారులు యువతనే టార్గెట్ చేస్తున్నారు. కరీంనగర్ పట్టణంతోపాటు జిల్లాలోని పల్లెల్లోనూ గంజాయి గుప్పుమంటోంది. సాయంత్రం అయిందంటే చాలు నిర్మానుష్య ప్రాంతాల్లో ఎక్కువ మంది గంజాయి సేవిస్తున్నారు. మూతపడిన దుకాణాలు, వాగుల పరిసరాలు, శివారు ప్రాంతాలు, వాడుకలో లేని భవనాల్లో ఇది గుట్టుగా సాగుతోంది. పోలీసులు తనిఖీలు చేసి, నియంత్రించినా చాప కింద నీరులాగా గంజాయి విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. కళాశాల విద్యార్థులు, కొంతమంది మైనర్లు, కార్మికులు గంజాయికి అలవాటు పడి, తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్స్, గంజాయి ప్యాకెట్లు

- ముగ్గురి రిమాండ్
- 550 గ్రాముల గంజాయి..
- గంజాయి చాక్లెట్స్ స్వాధీనం

సిరిసిల్లక్రైం: యువకులు, కార్మికులే లక్ష్యంగా నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ముగ్గురిని ఆదివారం సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్, శివనగర్, బీవైనగర్‌కు చెందిన యువరాజ్‌సింగ్, కొండ రంజిత్, ఎండీ గౌస్‌లను గంజాయి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. యువరాజ్‌సింగ్ నాందేడ్ నుంచి గంజాయి, గంజాయితో తయారు చేసిన చాక్లెట్స్‌ను సిరిసిల్లకు తీసుకొచ్చాడు. తను తాగుతూ విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని బతుకమ్మతెప్ప వద్ద గల మడేలయ్య గుడి వద్ద గంజాయి, చాక్లెట్స్ విక్రయిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాడి చేసిన పోలీసులు యువరాజ్‌సింగ్ వద్ద 250 గ్రాముల గంజాయి, గంజాయితో తయారు చేసిన 29 చాక్లెట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొండ రంజిత్‌కుమార్ కరీంనగర్‌లో గంజాయి కొని, రగుడు ఎల్లమ్మ గుడి సమీపంలోని చెట్ల పొదల్లో దాచిపెట్టాడు. అప్పుడప్పుడు ఆ గంజాయిని తాగడంతోపాటు ఇతరులకు విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న రంజిత్‌కుమార్‌ను పట్టుకోగా.. అతని వద్ద 120 గ్రాముల గంజాయి దొరికింది. బీవైనగర్‌కు చెందిన గౌస్ సైతం గంజాయి తాగడంతోపాటు ఇతరులకు విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని నుంచి 180 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

చదువు.. నైపుణ్యం

- గంభీరావుపేటలో స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం
- పీజీ, డిగ్రీ విద్యార్థులకు శిక్షణ తరగతులు
- వారంపాటు తరగతులు


అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు



వేషధారణలో విద్యార్థులు

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థులకు చదువుతోపాటు జీవితంలో దోహదపడే జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. గంభీరావుపేటలోని కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో భాగమైన ప్రభుత్వ పీజీ, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇటు బోధన తరగతులతోపాటు జీవన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో పీజీ, డిగ్రీ విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. జీవితంపై సమగ్ర దృక్పథాన్ని పెంచి ఉజ్వల భవిష్యత్ కోసం వారిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో శిక్షణ కొనసాగుతోంది. విద్యార్థి తను ఎంచుకున్న విభాగంలో అద్భుతమైన జ్ఞానం, నైపుణ్యాలు పెంచుకునేలా తర్ఫీదునిస్తున్నారు.

వారం రోజుల శిక్షణ

పీజీ, డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న అన్ని విభాగాల నుంచి 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారానే కాకుండా ప్రత్యక్షంగా పాత్రల రూపంలో నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఏం నేర్పిస్తున్నారంటే..

విద్యార్థుల్లోని బలం, బలహీనతలను గుర్తించేలా అవగాహన కల్పిస్తున్నారు. వారిలోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తున్నారు. భవిష్యత్ లక్ష్యాన్ని నిర్ణయించుకోవడం, దానికనుగుణంగా ప్రణాళికను రూపొందించుకోవడం గురించి వివరిస్తున్నారు. మానసిక దృఢత్వం కోసం ఏం చేయాలో శిక్షణనిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండడం, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, టీం వర్క్, సరైన నిర్ణయం తీసుకునేలా నైపుణ్యం, సమస్యలను పరిష్కరించుకోవడంపై అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా డిజిటల్ వినియోగం(మొబైల్, ఇంటర్నెట్), బ్యాంక్ లావాదేవీలు, ఉద్యోగ అన్వేషణ, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ తదితర అంశాలపై శిక్షణ కొనసాగిస్తున్నారు.

శిక్షణ బాగుంది



స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం బాగుంది. జాబ్ సెర్చ్ ఎలా చేసుకోవాలి, ఇంటర్వ్యూలలో రాణించాలంటే ఎలా ప్రిపేర్ కావాలో అవగాహన కల్పించారు. అకాడమిక్ క్లాసలతోపాటు ఇలాంటి ప్రోగ్రామ్స్ చేయడం వల్ల విద్యార్థులకు ప్రయోజనంగా ఉంటుంది.

– శృతిజ, బీఎస్సీ ఫైనలియర్

అర్థమయ్యేలా శిక్షణ



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రత్యక్ష పాత్రల ద్వారా, డిజిటల్ క్లాస్‌ల ద్వారా శిక్షణ ఇస్తున్నాం. చదువు పూర్తి చేసుకొని వెళ్లబోతున్న విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయడం, భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేర్చాలనేది ప్రధాన ఉద్దేశ్యం.

– మారుతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్

విద్యార్థులకు ప్రయోజనం



స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్యాల పెంపుదలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం భవిష్యత్‌లో విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

– వి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల, గంభీరావుపేట

వీడని జల మర్డర్ మిస్టరీ


జల (ఫైల్)

రాయికల్: పట్టణంలోని నాగారాం వాడకు చెందిన కోల జల పట్టపగలే దారుణ హత్యకు గురై, 26 రోజులు గడిసినా మర్డర్ మిస్టరీ వీడటం లేదు. గత ఆగస్టు 29న మధ్యాహ్నం 2 గంటల సమయంలో దుండగులు జల ఇంట్లోకి వెళ్లి, ఆమెను హత్య చేసి, పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించినప్పటికీ అసలు విషయం తెలియడం లేదు. మృతురాలి భర్త, కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. ఆస్తి తగాదాల విషయంలో బంధువులే జలను హత్య చేశారన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా హత్య చేసినట్లు దుండగుడు అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. మృతురాలి పుస్తెల తాడు రికవరీలో జాప్యం జరుగుతుండటంతో పోలీసులు సైతం అధికారికంగా ధ్రువీకరించకలేపోతున్నారు. మర్డర్ మిస్టరీ వీడకపోవడంతో కాలనీవాసులు సైతం భయభ్రాంతులకు గురువుతున్నారు. ఈ విషయమై ఎస్సై అజయ్‌ను వివరణ కోరగా విచారణ చేపడుతున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ ఏఎస్సై మృతి



ధర్మపురి: రక్తకణాలు తగ్గిపోయి, కాలికి గాయంతో ఇన్‌ఫెక్షన్ అయిన ఓ ఏఎస్సై చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని బంధువుల కథనం ప్రకారం.. ధర్మపురికి చెందిన కల్యాడపు రాజమల్లయ్య(60) వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్నారు. ఇటీవల జ్వరం కారణంగా రక్తకణాలు తగ్గిపోయాయి. దీంతోపాటు కాలికి గాయమై, తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు వారం క్రితం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయారు. మృతుడికి భార్య సులీల, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే ఏఎస్సై రాజమల్లయ్య మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి


కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

సిరిసిల్లఅర్బన్: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని 4వ వార్డు విద్యానగర్‌లో ఆదివారం పలువురు ముస్లిం యువకులు కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గడీల పాలన సాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు హైమద్‌ఖాన్, జిల్లా మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, ఆకునూరి బాలరాజు పాల్గొన్నారు. మీర్జా మతీన్, అబ్దుల్ అఫ్సన్, అబ్దుల్ రఫీక్, మీర్జా సమీ, యూనుస్, జీషన్, మోబిన్‌తోపాటు దాదాపు 50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


జీపీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సిరిసిల్ల: గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని దాచారంలో నూతన గ్రామపంచాయతీ భవనం, అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. బోటిమీదపల్లిలో బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి భూమిపూజ చేసి, సిరికొండలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సర్పంచ్ పర్శరాం, ఎంపీటీసీ తిరుపతి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ చందన్ తదితరులు ఉన్నారు.

నిరాశ్రయులకు ఆర్థిక సహాయం

- రేకుల షెడ్డు నిర్మాణానికి హామీ


బాధితులకు సాయం అందిస్తున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన ముద్దం పుష్పలత–ఎల్లయ్య దంపతుల ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆదివారం తన వంతుగా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ నిలువనీడను కోల్పోయి రోడ్డున పడ్డ ఆ కుటుంబం తాత్కాలికంగా తలదాచుకోవడానికి తన ఖర్చులతో రేకులషెడ్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు హసన్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యం.. ఇంటింటా సౌభాగ్యం

- ఎనిమిది రకాల వ్యాధులకు చికిత్సలు
- గ్రామీణులకు అవగాహనతో ముందుకు..
- ఆరోగ్య మహిళ పథకంపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే సమాజం బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే వేములవాడ ఏరియా ఆస్పత్రి, సిరిసిల్లలోని సుందరయ్యనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌తోపాటు తంగళ్లపల్లి, నేరెళ్ల పీహెచ్‌సీలలో అమలు చేస్తున్నారు. తాజాగా ముస్తాబాద్ మండలం పోతుగల్, ఇల్లంతకుంట పీహెచ్‌సీలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

ముందస్తు పరీక్షలతో అప్రమత్తం

సహజంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎవరితో చెప్పుకోలేరు. చాలా మంది వ్యాధి ముదిరిన తర్వాతే ఆస్పత్రులకు వెళ్తుంటారు. ఇలా చాలా మంది ప్రాణాపాయ స్థితులకు వెళ్లిన వారు ఉన్నారు. ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం మహిళ ఆరోగ్యం, ఇంటికి సౌభాగ్యం పేరుతో ముందస్తు పరీక్షలు చేస్తుంది. ఎనిమిది రకాల వైద్యపరీక్షలు చేసి ముందస్తుగా చికిత్స అందించే మార్గాలు చూపుతున్నారు.

క్యాన్సర్ ముప్పు తప్పించేందుకు..

మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో మహిళలు త్వరగా క్యాన్సర్ బారిన పడుతున్నారు. గుర్తించేలోపే ఈ వ్యాధి ముదిరి నాలుగో దశకు చేరుకుని మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీల్లో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు ఆయా గ్రామాల్లోని మహిళలను పీహెచ్‌సీలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ముందస్తుగా ఏడుగురు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి నాణ్యమైన వైద్యచికిత్స అందించేందుకు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

ఆ ఎనిమిది పరీక్షలు ఇవే..

పోతుగల్, నేరెళ్ల, వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రి, సిరిసిల్ల అర్బన్ సెంటర్, ఇల్లంతకుంట కేంద్రాల్లో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ నిర్వహిస్తున్నారు. నిపుణులైన వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. డయాగ్నోస్టిక్స్, క్యాన్సర్ నిర్ధారణ, సూక్ష్మపోషక లోపాలు, మూత్రాశయం ఇన్‌ఫెక్షన్స్, పీసీవోడీ, మోనోపాజ్, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ అంశాలపై వైద్యపరీక్షలు చేస్తారు.

అవగాహన కల్పిస్తేనే..

ఎంపిక చేసిన మండలాలు, అర్బన్ హెల్త్‌సెంటర్లలో చేస్తున్న వైద్యపరీక్షలపై అవగాహన, ప్రచారం కల్పించాలి. ఉచిత వైద్యపరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందించే ఈ కార్యక్రమం గ్రామాల్లో ఉండే మహిళలకు వరంగా భావించవచ్చు. మండల, గ్రామాల్లో సరైన వైద్య సదుపాయాలు లేక వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం మంచి విషయం.

స్పందన బాగుంది



ముస్తాబాద్ మండలంలో ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మహిళల నుంచి స్పందన బాగుంది. ప్రతీ మంగళవారం పెద్ద ఎత్తున ఆస్పత్రికి వస్తున్నారు. గ్రామీణులకు ఆశ, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పిస్తున్నారు.

– డాక్టర్ గీతాంజలి, పోతుగల్

అవగాహన కల్పిస్తున్నారు



మహిళలకు వచ్చే రోగాలపై చెబుతున్నారు. రోగం ఉన్నది.. లేనిది తెలుసుకునేందుకు ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. ఎవరికైనా రోగం వచ్చిందని తెలిస్తే వాళ్లే అంబులెన్స్‌లో పెద్ద దవాఖానాలకు తీసుకుపోతున్నారు.

– బద్దిపడిగె ఎల్లవ్వ, మొర్రాయిపల్లి

పరీక్షలు చేయించుకున్నం



మహిళలకు ఎనిమిది రకాల వైద్య పరీక్షలు చేయిస్తున్నారని చెప్పారు. మాకు తెలిసిన వాళ్లు ఇక్కడికొచ్చి పరీక్షలు చేయించుకున్నారు. అన్ని రకాల రక్తపరీక్షలు చేస్తున్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని చేపట్టిన ఈ కార్యక్రమం బాగుంది.

– తలారి పుష్ప, పోతుగల్

ఆరోగ్యవంతమైన సమాజం కోసం..



ఆరోగ్య సమాజ నిర్మాణానికి ప్రభుత్వం మహిళ ఆరోగ్యం విషయంలో చర్యలు తీసుకుంటుంది. ఎనిమిది రకాల వైద్య పరీక్షలు చేసి, వ్యాధులకు గురైన వారిని హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్లకు తరలిస్తున్నాం. ప్రతీ మంగళవారం పరీక్షలు చేస్తున్నాం.

– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి